క్లుప్తంగా

నేడు అద్దెకు షాపుల కేటాయింపు

గరుగుబిల్లి: స్థానిక ఐటీడీఏ పార్కు దగ్గరి షాపులను అద్దె ప్రాతిపదికన మహిళా సంఘాల సభ్యులకు శుక్రవారం కేటాయిస్తున్నట్లు వెలుగు ఏపీఎం పి.అప్పలనాయుడు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. కలెక్టరు ఆదేశాల మేరకు పార్కు ఆవరణలో వ్యాపారం చేసుకునేందుకు రూ.2 వేలు అద్దెకు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆసక్తి ఉన్న వారు ఆధార్ కార్డు తీసుకుని ఉదయం 10 గంటలకు పార్కు వద్దకు హాజరుకావాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు షాపుల కేటాయింపులో ప్రాధాన్యం ఉంటుందన్నారు.

విజ్ఞాపన సభకు తరలిరండి



శంకరరావు

కొమరాడ: విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద ఈ నెల 11వ తేదీన చేపట్టే విజ్ఞాపన సభకు తరలిరావాలని పార్వతీపురం మన్యం జిల్లా ఎంటీఎస్(మినిమం టైం స్కేల్) ఉపాధ్యాయ సంఘ నాయకుడు పూడి శంకరరావు ఓ ప్రకటనలో గురువారం కోరారు. ఎంటీఎస్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా చేపడుతున్న ఈ కార్యక్రమంలో ఉద్యోగాల క్రమబద్ధీకరణ, ఉద్యోగ విరమణ అనంతరం పెన్షన్ సదుపాయం, వైద్య సదుపాయాలు వంటి అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లనున్నామన్నారు. 1998 ఎంటీఎస్ ఉపాధ్యాయులంతా ఈ కార్యక్రమానికి హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

104 సేవలు సద్వినియోగం చేసుకోవాలి

సీతంపేట: రోగులు 104 వాహనం ద్వారా అందుతున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని 104 జిల్లా మేనేజర్ ఎస్.కృష్ణ అన్నారు. మండలంలోని కుశిమి పీహెచ్‌సీలో ఉన్న 104 వాహనంలో ఎక్విప్‌మెంట్‌ను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్ని రికార్డులు, మందుల లభ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనాల కండీషన్ ఎప్పటికప్పుడు పరిశీలించి.. సమస్యలుంటే తెలియజేయాలన్నారు.

బోరు ఏర్పాటుకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల యూత్ అధ్యక్షుడు రమేష్

భామిని: మండలంలోని గజపతినగరంలో నిర్మిస్తున్న ఆంజనేయ మందిర వద్ద బోరు ఏర్పాటుకు వైఎస్సార్‌సీపీ మండల యూత్ అధ్యక్షుడు గెల్లంకి రమేష్ గురువారం భూమి పూజ చేశారు. భక్తులకు తాగునీరు అందించాలనే ఉద్దేశంతో తన సొంత నిధులతో బోరు ఏర్పాటు చేస్తున్నారు.

అటవీ హక్కుల చట్టంపై అవగాహన

భామిని: మండలంలోని డోకులగూడలో వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో గిరిజనులకు అటవీ హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వెలుగు ఏసీఓ చిరంజీవిరావు, ఎ. నాగరాజు మాట్లాడుతూ.. పోడు భూములపై హక్కులు ఎలా పొందాలో అవగాహన కల్పించారు. సామాజిక అవసరాలు, ఆవశ్యకతలపై వివరించారు. కార్యక్రమంలో సీసీ జగయ్య, ఏపీఎఫ్ నాగేశ్వరరావు, గిరిజనులు పాల్గొన్నారు.

శక్తియాప్‌పై అవగాహన



విద్యార్థినులకు అవగాహన కలిగిస్తున్న శక్తి టీమ్ సభ్యుల

పాలకొండ: మహిళలకు శక్తి యాప్ రక్షణగా ఉంటుందని శక్తి టీమ్ ఏఎస్సై రూన్సీబాయి తెలిపారు. గురువారం స్థానిక సత్యసాయి జూనియర్ కళాశాల ఆవరణలో శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆపద సమయంలో శక్తి యాప్ రక్షణగా నిలుస్తుందని చెప్పారు. 112 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేయడం ద్వారా తక్షణ సహాయం అందుతుందన్నారు. కార్యక్రమంలో శక్తి టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

రాయితీపై వ్యవసాయ పరికరాల పంపిణీ

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని టీకే జమ్ము పంచాయతీ గిరిజన రైతులకు రాయితీపై వ్యవసాయ పరికరాలు గురువారం పంపిణీ చేశారు. 50 మంది గిరిజన రైతులకు నాబార్డు సహకారంతో ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో టార్పాలిన్లు, పవర్ వీడర్లు, ఇంజిన్లు అందజేసినట్లు ఆ సంస్థ సీఈవో బిడ్డిక సుగ్రీవులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ అడ్డాకుల భారతి తదితరులు పాల్గొన్నారు.

సహజ కంచెతో రక్షణ..

- వాక్కాయ మొక్కలతో కంచె
- ఖర్చు తక్కువ.. ఫలితం ఎక్కువ
- అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది



పంటకు సహజ కంచెగా తయారైన వాక్కాయ చెట్లు



అదనపు ఆదాయం ఇచ్చే వాక్కాయ పళ్లు

భామిని: ఎంతో కష్టపడి పండించిన పంటను పశువులు, అడవి జంతువుల నుంచి రక్షించుకోవడానికి రైతు నానా తంటాలు పడుతుంటాడు. పంట చేతికొచ్చే సమయంలో దిగుబడి కోల్పోతే అన్నదాతకు భరించలేని కష్టంగా ఉంది. అందుకే పంటకు కంచె తప్పనిసరని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. అయితే ఇనుప వైర్‌తో ఫెన్సింగ్, కాంక్రీట్ స్తంభాలకు జాలీలు వేయడం ఖర్చుతో కూడుకున్న పని. దీన్ని చిన్న రైతులు భరించడం కష్టం. ఈ తరుణంలో సహజ రక్షణ కవచాలను వ్యవసాయ శాస్త్రవేత్తలు సిఫార్సు చేస్తున్నారు. అదే కరోండా జీవకంచె. వీటినే వాక్కాయ మొక్కలని అంటారు. ఈ మొక్కలు సహజ కంచెగా ఏర్పడి పంటకు రక్షణతో పాటు రైతుకు ఆదాయం కూడా ఇస్తుంది.

కరోండా ప్రయోజనాలు..

- వాక్కాయగా పిలిచే కరోండా చిన్న పొద రూపంలో పెరుగుతుంది. దీని కాండాలు, కొమ్మలు ముళ్లతో నిండి ఉంటాయి. ఎండలు, తక్కువ నీరు, ఎలాంటి వాతావరణ పరిస్థితులనైనా తట్టుకొని పెరుగుతుంది. ఎప్పుడూ పచ్చగా ఉండే ఈ మొక్క పొలానికి సహజమైన గోడలా మారి పంటకు రక్షణగా ఉంటుంది.
- కరోండా ముళ్లతో నిండి ఉండడం వల్ల మేకలు, ఆవులు, ఎద్దులు పొలంలోకి రావడం కష్టమే. రాత్రి పూట అడవి పందులు, కుందేళ్లు కూడా ఈ కంచెను దాటలేవు. ఇలా పంటను పంటను కాపాడుకోవచ్చు.
- కరోండా పళ్లు ఎరుపు రంగులో చిన్నగా, పుల్లగా ఉంటాయి. వీటిని వాడి పచ్చళ్లు, మురబ్బా, జామ్, జెల్లీ లాంటి పదార్థాలు కూడా తయారు చేయవచ్చు. మార్కెట్లో వీటికి గిరాకీ ఉండడంతో రైతుకు అదనపు ఆదాయం లభిస్తుంది.
- కరోండా మొక్క వేర్లు గట్టిగా విస్తరించి మట్టిని బలంగా పట్టుకుంటాయి. ముఖ్యంగా కొండ ప్రాంతాల్లో నేల కోతను, మృత్తికా క్రమక్షయాన్ని తగ్గించి పంటకు అవసరమైన తేమను నిల్వ ఉంచుతాయి.
- .కరోండా పొదల్లో పక్షులు గూళ్లు కట్టుకుంటాయి. ఇవి పంటలను ఆశించే రక రకాల పురుగులను తిని పంటకు మేలు చేస్తాయి. తేనెటీగలు ఆ పూలపై తిరుగుతాయి. వీటి వల్ల పొలాల్లో పరాగ సంపర్కం జరిగి పంట దిగుబడి పెరుగుతుంది. ఇలా కరోండా కంచె ఒక చిన్న జీవవైవిధ్య కేంద్రంగా పనిచేస్తుంది.
- కరోండా ఒకసారి నాటితే 20 నుంచి 25 ఏళ్ల పాటు పంటకు రక్షణ గోడలా ఉంటుంది. ప్రతి ఏడాదీ ఖర్చు ఉండదు. ఇనుప కంచె అయినా తుప్పు పడుతుంది కాని వాక్కాయ చెట్లు బలపడితే రైతుకు ఆదాయం పెరుగుతుంది.

సహజ కంచె నాటే విధానం..

- వర్షాకాలంలో కరోండా నాటితే బాగా పెరుగుతుంది.
- పొలానికి చుట్టూ మీటర్ దూరంలో ఒక మొక్క నాటాలి.
- మొదటి రెండేళ్లలో మొక్కలను నీరు పోయడం, ఎరువులు వేయడం అవసరం.
- మూడో ఏడాది నుంచే ఇది సహజమైన జీవకంచెగా మారిపోతుంది.
- ఎప్పటికప్పుడు పొదలను కొంచెం కత్తిరించి సమానంగా పెంచితే కంచె మరింత బలంగా ఉంటుంది.

ప్రోత్సాహిస్తున్నాం..



రైతు వేసే పంటకు కంచె ముఖ్యం. కూరగాయల సాగులోనూ వాక్కాయ కంచె ఉపయోగపడుతుంది. శాస్త్రవేత్తల సూచనలను మేరకు రైతులను ప్రోత్సాహిస్తున్నాం. వాక్కాయ మొక్కలు అన్ని ప్రాంతాల్లోనూ పెరుగుతాయి, అందుబాటులో ఉంటాయి.

– కొల్లి తిలక్, వ్యవసాయాధికారి, భామిని

చిరుద్యోగిపై రాజకీయమా..?



హెచ్‌ఎంను ప్రశ్నిస్తున్న రమాదేవి, వైస్సార్‌సీపీ నాయకులు, తల్లితండ్రులు

పాలకొండ రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధిపై దృష్టి సారించకుండా రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని గ్రామ స్థాయికి తీసుకువస్తోందని ఎం.సింగుపురం సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకురాలు రణస్థలం రమాదేవి అన్నారు. గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో కొద్ది సంవత్సరాలుగా స్వీపర్‌గా విధులు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్న చిరుద్యోగి తంపర రెయ్యమ్మపై పాఠశాల విద్యా కమిటి కక్ష సాధింపునకు దిగడం సరికాదన్నారు. ఈ చర్యను నిరసిస్తూ పాఠశాల పరిధిలో బోధన పొందుతున్న పొట్టిలి, డోలమడ, అవలంగి, జంపరకోట పంచాయతీలకు చెందిన విద్యార్థుల తల్లి దండ్రులతో కలసి ఆమె గురువారం పాఠశాలకు చేరుకున్నారు. బాధిత రెయ్యమ్మను తీసుకుని హెచ్‌ఎం సంఘంనాయుడును కలిశారు. కేవలం రాజకీయ వేధింపుల్లో భాగంగా కూటమికి చెందిన విద్యా కమిటీ ఒత్తిడితో చిరుద్యోగిని తొలగించడం సరికాదన్నారు. సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్న రెయ్యమ్మను వయోభారం పేరిట తొలగించడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. ఏ నిబంధనల మేరకు స్వీపర్‌గా (ఆయా) తప్పిస్తున్నారో చెప్పాలని డిమాండ్‌చేశారు. హెచ్‌ఎం మాట్లాడుతూ.. ఇది తన వ్యక్తిగత నిర్ణయం కాదన్నారు. అయితే ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని సర్పంచ్, తదితరులు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, పిల్లల తల్లిదండ్రులు రణస్థలం రాంబాబు, పైల వాసుదేవరావు, తిరుపతిరావు, వెంకటనాయుడు, కోట బాబురావునాయుడు, గులివిందల రామిచంద్రినాయుడు, నీలం ఆనందరావు, పాండ్రంకి శ్రీనివాసరావు, మీసాల వెంకటరమణ, కోట కృష్ణంనాయుడు, తాడేల సుగుణాకరరావు, ఆశోక్ తదితరులున్నారు.

మానసిక ఒత్తిడికి గురికావొద్దు

కురుపాం: విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికావద్దని, ప్రశాంత వాతావరణంలో విద్యనభ్యసిస్తే చదివింది గుర్తుంటుందని జిల్లా కెరీర్, మెంటల్ హెల్త్ కౌన్సిలర్ రేవళ్ల అనంతరావు తెలిపారు. స్థానిక ఆదర్శ పాఠశాల, జ్యోతిరావు పూలే బీసీ వెల్ఫేర్ స్కూల్‌లో మైండ్ మేటర్స్‌పై గురువారం అవగాహన కల్పించారు. విద్యార్థులంతా మంచి అలవాట్లు అలవర్చుకోవాలని, ఉదయాన్నే నిద్ర లేచి చదవడం , ధ్యానం చేయడం, మంచి ఆహారపు అలవాట్లు వంటివి అలవాటు చేసుకోవాలని సూచించారు.

సీహెచ్‌సీకి రోగుల తాకిడి



వైద్య సేవల కోసం కురుపాం సీహెచ్‌సీకి పోటెత్తిన రోగులు

కురుపాం: స్థానిక సీహెచ్‌సీ(సామాజిక ఆరోగ్య కేంద్రం)కి రోగుల తాకిడి ఎక్కువైంది. గురువారం ఓపీ 300 దాటిందంటే ఏ మేర రోగులు వచ్చి ఉంటారో ఇట్టే అర్థమవుతుంది. ఇదే రోజు వారపు సంత కావడం, కురుపాం, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస, కొమరాడ మండలాల రోగులకు ఇదొక్కటే పెద్దదిక్కు కావడంతో ఆరోగ్య తనిఖీలు, రక్త పరీక్షలు, మందుల కోసం రోగులు పోటెత్తారు. అదే సమయంలో ఆస్పత్రి సందర్శనకు వచ్చిన కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి..ఆస్పత్రిలో రోగులకు ఉండే అరకొర సదుపాయాలు, మంచానికి ఇద్దరు రోగులు చొప్పున ఉండడం చూసి గత ప్రభుత్వంలో మంజూరై చివరి దశ నిర్మాణంలోని 50 పడకల ఆస్పత్రి భవనాన్ని నెలరోజుల్లో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు.

ఘనంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవం



కొమరాడ: కార్యక్రమంలో పాల్గొన్న ఐసీడీఎస్ సిబ్బంది, విద్యార్థులు

కొమరాడ:

మండలంలోని కోటిపాం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. భావి భారత పౌరులైన పిల్లల ఆరోగ్యం చాలా ముఖ్యమని, పిల్లల ఆరోగ్యానికి ప్రాధాన్యమివ్వాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శారదాంబ తెలిపారు. అనంతరం పిల్లలకు నిర్వహించిన పలు పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు.



గుమ్మలక్ష్మీపురం: మ్యూజికల్ చైర్ గేమ్ ఆడుతున్న విద్యార్థినులు

గుమ్మలక్ష్మీపురం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికలకు క్రీడాపోటీలు గురువారం నిర్వహించారు. ఈ నెల 11వ తేదీన అంతర్జాతీయ బాలికా దినోత్సవం పురస్కరించుకుని, ఐసీడీఎస్ భద్రగిరి ప్రాజెక్టు సూపర్‌వైజర్లు ఎస్.గౌరమ్మ, నాగమణి ఆధ్వర్యంలో గుమ్మలక్ష్మీపురం కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థినుల మధ్య రన్నింగ్, క్విజ్, మ్యూజికల్ చైర్ క్రీడాపోటీలు చేపట్టారు.

రాష్ట్ర స్థాయిలో సత్తా చాటాలి



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో హెచ్‌ఎం, తదితరులు

పాలకొండ రూరల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడాల్లో రాణించాలని పాలకొండ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం దాసరి నాగభూషణం అన్నారు. ఈ మేరకు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను గురువారం ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిరంజీవినాయుడు, నవీన్‌కుమార్, రాజేశ్వరి పరుగుపందెం, కబడ్డీ పోటీల్లో రాణించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. అక్కడ కూడా రాణించి పాఠశాలకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీడీ నిరీక్షణ, బౌరోతు శంకరరావు, నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేను సద్వినియోగం చేసుకోండి

- తహసీల్దార్ రాధాకృష్ణమూర్తి



రీ సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్, సిబ్బంది

పాలకొండ: ప్రభుత్వం చేపడుతున్న భూముల రీసర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రాధాకృష్ణమూర్తి అన్నారు. మండలంలోని అంపిలి గ్రామంలో జరుగుతున్న రీ సర్వేను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ.. రీ సర్వే చేయడం ద్వారా రైతులకు తమ భూములకు సంబంధించిన పూర్తి వివరాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఎటువంటి తప్పులు చోటుచేసుకోకుండా రైతుల సమక్షంలో సర్వే చేయడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ శ్రీనివాసరావు, సర్వే సిబ్బంది ఉన్నారు.

జీఎస్టీపై అవగాహన

సీతంపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జీఎస్‌టీ 2.0పై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సుశాంత్ జనా మాట్లాడుతూ.. జీఎస్టీ శ్లాబులు తగ్గించడం వల్ల నిత్యావసర సరుకుల ధరలు బాగా తగ్గాయని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రభాకరరావు, ఎస్.రవి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు



రాష్ట్ర క్రీడలకు ఎంపికైన బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు

సీతంపేట: స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలకు ఎంపికై నట్లు హెచ్‌ఎం వసంతలక్ష్మి తెలిపారు. ఈ మేరకు విద్యార్థినులను గురువారం ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అండర్ – 14, 17 విభాగాల్లో 39 మంది ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూఓ పాలక అమల, పీడీ శైలజ, తదితరులు పాల్గొన్నారు.

జిల్లేడు ద్రావణంతో చీడపీడల నివారణ



జిల్లేడు ద్రావణం తయారీ వివరిస్తున్న అంబోజీ, సొంబర

భామిని: జిల్లేడు ద్రావణంతో చీడపీడలను నివారించవచ్చని ఏపీసీఎన్ఎఫ్ మాస్టర్ ట్రైనీ మోటక అంబోజీ అన్నారు. మండలంలోని నల్లరాయిగూడలో ప్రకృతి వ్యవసాయంపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనీ మాట్లాడుతూ.. వరి చేనులో పొటాష్, జింక్ లోప నివారణకు, ఆకుముడత పురుగు నిర్మూలనకు జిల్లేడు ద్రావణం ఉపయోగపడుతుందని చెప్పారు. అనంతరం ద్రావణం తయారీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీ వూయక సొంబర, గిరిజన రైతులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల ఎదుట నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న విదసం ఐక్యవేదిక సభ్యులు

కురుపాం: స్థానిక గురుకుల పాఠశాల ఎదుట విదసం(విస్తృత దళిత సంఘాలు) ఐక్య వేదిక సభ్యులు గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఇదే పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు పచ్చకామెర్లతో మృతి చెందగా, వారి ఆరోగ్యం పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని తప్పుబట్టారు. పాఠశాలలోని అపరిశుభ్ర వాతావరణ పరిస్థితులు, కలుషిత తాగునీరు వల్లే విద్యార్థులు ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చిందని, దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆ సంఘ రాష్ట్ర కన్వీనర్ బూసి వెంకటరావు అన్నారు. అలాగే బాధిత కుటుంబాలకు పరిహారం అందజేయాలన్నారు. విద్యార్థినుల మృతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయాలన్నారు. ఇదే పాఠశాలకు చెందిన 140 మంది అనారోగ్యం బారినపడితే ప్రభుత్వం ఏం చేస్తోందని, అధికారుల నిర్లక్ష్యమూ దీనిలో భాగమేనన్నారు. కార్యక్రమంలో ఓంకార్, భాస్కరరావు, నాగభూషణం, విదసం ఐక్య వేదిక పార్వతీపురం మన్యం జిల్లా ఇన్‌చార్జ్ బొమ్మాళి సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు

వీరఘట్టం: పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి స్పందన కరువైంది. మండల వ్యాప్తంగా 34 మంది సర్పంచ్‌లకు గాను.. ఆరుగురు సర్పంచ్‌లు, మరో ముగ్గురు ప్రతినిధులు హాజరయ్యారు. పంచాయతీ కార్యదర్శులు 30 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ బి. వెంకటరమణ మాట్లాడుతూ.. పంచాయతీకి నిధులు ఎలా సమకూర్చుకోవాలో వివరించారు. అనంతరం పలు సమస్యలపై నీలానగరం సర్పంచ్ వి.పురుషోత్తమరావునాయుడు అధికారులను ప్రశ్నించారు.

మరీ ఇంత నిర్లక్ష్యమా..!



తుప్పల్లో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

వీరఘట్టం: మూడున్నరేళ్ల కిందట చేపట్టిన వీరఘట్టం ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో భాగంగా జంక్షన్‌లో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆర్అండ్‌బీ అధికారులు తొలగించారు. అయితే ఈ పనులు పూర్తయి ఏడాది కావస్తున్నా ఇంతవరకు ఈ విగ్రహాన్ని మెయిన్ రోడ్డులో ఏర్పాటు చేయకపోవడం అన్యాయమని కేవీపీఎస్ నాయకులు మండిపడ్డారు. ఈ మేరకు తుప్పల్లో వదిలేసిన అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు ఎన్.సింహాచలం, ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

పొగాకుకు దూరంగా ఉండండి



అవగాహన ర్యాలీ చేపడుతున్న వైద్య సిబ్బంది

పాలకొండ: యువత పొగాకు వినియోగానికి దూరంగా ఉండాలని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ కడియం చిరంజీవి అన్నారు. గురువారం స్థానిక ఏరియా ఆస్పత్రి ఆవరణలో పొగాకు ఫ్రీ యూత్ అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పొగాకు వినియోగం ద్వారా కలిగే అనర్థాలపై ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యువత ఎక్కువగా ఖైనీ, గుట్కా, పొగాకు వంటి మత్తు పదార్థాల బారిన పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. యువతను చైతన్య పరచడానికి 60 రోజులు అవగాహన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల వసతిగృహాలు పరిశుభ్రంగా ఉండాలి

- జేసీ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి



వంటగదిలో సాంబారు పరిశీలిస్తున్న జేసీ యశ్వంత్‌కుమార్ రెడ్డి

కొమరాడ: విద్యార్థులకు పౌష్టికాహారం అందివ్వడంతో పాటు వారి వసతిగృహాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని జేసీ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి ఆదేశించారు. మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలురు పాఠశాల, బాలికల ఆశ్రమ పాఠశాల, ఉలిపిరి బాలికల ఆశ్రమ పాఠశాలలతో పాటు కూనేరు రామభద్రపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆయన గురువారం ఆకస్మికంగా సందర్శించారు. అక్కడి వసతులను పరిశీలించి, పలు సూచనలు చేశారు. విద్యార్థుల హాస్టళ్లకు సంబంధించి, వంటగది, విద్యార్థుల డార్మిటరీ, పాఠశాల తరగతులు, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. విద్యార్థులకు వేడివేడి ఆహారం అందివ్వాలని, వారికి స్వచ్ఛమైన తాగునీరు అందేలా చూడాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆస్పత్రిలో రోగులకు అవసరమైన అన్ని సదుపాయాలు అందివ్వాలని, వారికి సకాలంలో చికిత్స అందేలా సిబ్బంది పనిచేయాలని తెలిపారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ లక్ష్మణరావు, తహసీల్దారు సత్యనారాయణ, ఎంపీడీవో మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.